నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 14 నవంబర్ 2024 | SANGAREDDY




సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

## గ్రూప్-3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 13: టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో రీజినల్ కోఆర్డినేటర్లు, స్ట్రాంగ్ రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డీవోలు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్లతో నిర్వహించిన శిక్షణ, సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా చూడాలన్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటల వరకే చేరుకోవాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు పాటించాల్సిన సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవరావు, వివిధ కేటగిరీల అధికారులు పాల్గొన్నారు.

## తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం



చేర్యాల పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నిస్తున్న తండ్రీకొడుకులు

- అధికార పార్టీ నేతల ఒత్తిడే కారణమంటున్న బాధితులు

చేర్యాల, నవంబర్ 13: భూ సమస్య నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతలు పోలీసులతో ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన అవుశర్ల సత్యనారాయణ, అవుశర్ల వెంకటేశ్ బుధవారం చేర్యాల పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నించిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఈ విషయమై వెంకటేశ్ విలేకరులతో మాట్లాడుతూ కొన్నేండ్లుగా తమ పెద్దనాన్నతో భూ సమస్య ఉందని, దానిని పరిష్కరించుకునేందుకు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరుగుతున్నాయన్నారు. ఈ సమస్య విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు తమపై పెద్దనాన్నతో పోలీసులకు ఫిర్యాదు చేయించినట్లు పేర్కొన్నారు. వెంటనే భూ సమస్యను పరిష్కరించాలని వారు పోలీసులపై ఒత్తిడి తీసుకురావడంతో వారు మమ్మల్ని పోలీస్‌స్టేషన్ పిలిపించారని, దీంతో మనస్తాపానికి గురై డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకునేందుకు యత్నించామన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ నరేశ్ విలేకరులతో మాట్లాడుతూ ఎవరి ఒత్తిడి తమపై లేదని, భూమి దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్‌ను తిప్పిపంపారని ఫిర్యాదు రావడంతో విచారణ కోసం వారిని స్టేషన్‌కు పిలిపించామని, ఇంతలో వారు డీజిల్ పోసుకున్నారని తెలిపారు.

## ఆస్తి రాయించుకొని వెళ్లగొట్టారు..

- కోహెడ తహసీల్ కార్యాలయంలో వృద్ధుడి ఫిర్యాదు



నాయబ్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మెరుకు చంద్రయ్య

*కోహెడ, నవంబర్ 13: ఆస్తి రాయించుకొని వెళ్లగొట్టారని వృద్ధుడు తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. కోహెడ మండలం ఒగులాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ రైతు మెరుగు చంద్రయ్య పిల్లలు చూడటం లేదని, తన పేరున ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని 3 నెలలుగా పట్టించుకోవడం లేదని మంగళవారం కోహెడ నాయబ్ తహసీల్దార్ దేవేంద్రకు ఫిర్యాదు చేశారు. తన భార్య గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బందులు పడగా చేతిలో ఉన్న డబ్బులతో చికిత్స చేయించినా ఆమె బతకలేదన్నారు. నేను ఒక్కడినే ఉండడంతో తన అన్న కుమారుడు మెరుగు రాజయ్య అతడి తనయుడు సురేశ్ మాయమాటలు చెప్పి సర్వే నెంబరు 632/అ, 633/ఆ లో తనకున్న ఎకరం ఇరవై గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మూడు నెలలు దాటిన తర్వాత తనను ఇంటి నుంచి వెళ్లగొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాజయ్యపై చర్యలు తీసుకొని తన భూమిని తనకు ఇప్పించాలని కోరాడు.*

## ఎవరి పాపమో.. చెట్ల పొదల్లో పసికందు

- కవర్లో మూటగట్టి ఊరు బయట పడేసిన కసాయి తల్లి



శిశువును సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో అప్పగిస్తున్న 108 టెక్నీషియన్ మహేందర్

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 13 : ఎవరు చేసిన పాపమో గానీ..పసికందుకు శాపంగా మారింది. ఆడపిల్ల భారం అనుకున్నారో...మరో కారణమో గానీ అప్పుడే పుట్టిన బిడ్డను ప్లాస్టిక్ కవర్లోమూటగట్టి ఊరు బయట చెట్ల పొదల్లో విసిరేశారు. ఈ సంఘటన బుధవారం కొండపాక మండలం దుద్దెడలోని శివాజీనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దుద్దెడ గ్రామానికి చెందిన ఓ యువకుడు గ్రామ శివారులోని ఇండ్ల సమీపంలో మేకలను మేపుతుండగా పసికందు ఏడుపు వినిపించింది. ఆ యువకుడు వెళ్లి చూడగా చెట్ల పొదల్లో కవర్లో కట్టి పడేసిన ఆడ శిశువు కనపడింది. స్థానికులకు సమాచారం ఇవ్వడంతో దుద్దెడ మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహాదేవ్ గౌడ్ 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి 108 అంబులెన్స్ టెక్నిషియన్ మహేందర్, పైలెట్ మల్లేశ్ చేరుకొని డాక్టర్ దుర్గాప్రసాద్ సలహాలు, సూచనలు పాటిస్తూ శిశువుకు ప్రథమ చికిత్స అందించడంతోపాటు సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## ఆరు గ్యారంటీలు ఎగ్గొట్టేందుకే కుటుంబ సర్వే



గుమ్మడిదల, నవంబర్ 13: కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే రైతు భరోసా ఎగ్గొట్టారు. నాలుగు వేల పింఛన్, మహిళలకు ఇచ్చిన హామీలను ఎగ్గొందుకే బ్యాంకు అకౌంట్లను కుటుంబ సర్వేలో అడుగుతున్నారు. కులగణనలో కులాలకు సంబంధించిన అంశాలే అడగాలి, వ్యక్తిగత ఆస్తి వివరాలు ఎందుకు అడుగుతున్నారు. కారుందా, బైక్ ఉందా, భవనముందా? ఎన్ని ఎకరాల పొలం ఉంది, వ్యాపారం చేస్తున్నారా, రియల్ వ్యాపారమా? వార్షిక టర్నోవర్ ఎంతా? ట్యాక్సీ కడుతున్నారా అనే ప్రశ్నలు అడడం వెనుక సంక్షేమ పథకాలకు ఎగనామం పెట్టడానికే. కులగణన చేయడం మంచిదే, అయిన గణన పేరుతో సంక్షేమ ఫలాలు ఎగ్గొట్టడానికే అన్నట్టు సర్వే జరపడంపై ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనిపై సర్కారు ప్రజలకు కచ్చితమైన హామీ ఇవ్వాలి.

– చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు, గుమ్మడిదల మండలం



సిద్దిపేట జిల్లా మద్దూరులో కుటుంబ వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్



నిజాంపేట మండలం తిప్పనగుల్లలో రైతుబంధు పథకంపై ఎన్యూమరేటర్‌ను ప్రశ్నిస్తున్న గ్రామస్తురాలు నాగలక్ష్మి

# ప్రశ్నిస్తున్న ప్రజానీకం..!

### ఇంటింటి సర్వేకు వస్తున్న ఎన్యూమరేటర్లకు ప్రశ్నలు సంధిస్తున్న ప్రజలు

- ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా సర్వే ఎందుకని ప్రశ్నలు
- రైతుభరోసా, పంట రుణమాఫీపై నిలదీతలు
- నాలుగు వేల పింఛన్, రూ.2500 సాయం ఏమైందని కడిగేస్తున్న మహిళలు
- సంక్షేమ పథకాల కోత పెట్టేందుకే సర్వే అని ఆగ్రహం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో సర్వేకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత

సిద్దిపేట, నవంబర్ 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సర్వేల పేరిట కాలయాపన చేస్తున్నదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసిన తర్వాతనే సర్వేకు రావాలని నిలదీస్తున్నారు. దీంతో ప్రజలకు సమాధానం చెప్పలేక ఎన్యూమరేటర్లు తల పట్టుకుంటున్నారు. సంక్షేమ పథకాలను కోత పెట్టేందుకే ఈ సర్వే చేస్తున్నారా అంటూ ఎన్యూమరేటర్లను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మా అప్పుల గురించి అడుగుతున్నారు. ఈ ప్రభుత్వం కడుతుందా..? అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. మభ్యపెట్టేందుకే ఈ సర్వే అంటూ ప్రభుత్వ తీరుపై ప్రజలు మండి పడుతున్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**మా అప్పులు మీరు కడతారా..?**

సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లకు ప్రజల నుంచి విచిత్ర ప్రశ్నలు ఎదురవుతున్నాయి. దేనికోసం ఈసర్వే చేస్తున్నారు..? దీనికి చట్టబద్ధత ఉందా..? మేము చెప్పిన సర్వే వివరాలు గోప్యంగా ఉంచుతారా..? అనే నమ్మకం ఏమిటీ ఇలా విభిన్న ప్రశ్నలను ప్రజలు సంధిస్తుండడంతో ఎన్యూమరేటర్లు తలపట్టుకుంటున్నారు. తమను ప్రభుత్వం పంపిందని, తాము సర్వేకు వచ్చామని, మీరు వివరాలు చెబితే రాసుకుంటామని, లేకపోతే లేదు అంటూ వారి నుంచి సమాధానం వస్తున్నది. సర్వేలో పొందు పరిచిన పలు అంశాలపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని అన్ని గ్రామాలు, అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలు ఎన్యూమరేటర్లను ప్రశ్నిస్తున్నారు.మేము తీసుకున్న అప్పుల వివరాలు అడుగుతున్నారు.. మా అప్పులు మీరు కడుతారా..? మాకు ఎంత అప్పు ఉంది అని అడిగినప్పుడు మీరు కడతారా..? అనే గ్యారంటీ మాకు ఇవ్వాలి కదా అని సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లను ప్రజలు ప్రశ్నించడంతో వారు మౌనంగా ఉండి పోతున్నారు. ఎన్ని ప్లాట్లు ఉన్నాయి..? ఎంత జాగా ఉంది అని అడుగుతున్నారు. ఇవన్నీ ప్రభుత్వం వద్ద లేవా..? మేము కరెంట్ వాడుతుంది ప్రభుత్వానికి తెలువదా...? మా పేర్లపై ఎంత భూమి ఉంది ప్రభుత్వం వద్ద లెక్కలు లేవా..? ఇలా ప్రజలు ప్రశ్నించడంతో ఎన్యూమరేటర్లు ఏం చేయాలో అర్థం కాక భిక్కమొహం వేస్తున్నారు. మరికొన్ని కుటుంబాలు సర్వే వివరాలు చెప్పడం లేదు.

**సర్వేలో 75కి పైగా ప్రశ్నలు**

ఉమ్మడి మెదక్ జిల్లాలో సర్వేను ఈనెల 9న ప్రారంభించారు. 6 నుంచి 8వ తేదీ వరకు ఇండ్లకు స్టిక్కర్లను అంటించారు. 9వ తేదీ నుంచి ఇంటింటి సర్వే మొదలైంది. మొత్తంగా 75 పైగా ప్రశ్నలు సర్వేలో ఉన్నాయి.

- సిద్దిపేట జిల్లాలో 3,45,312 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాల సర్వేకు 2,302 బ్లాకులుగా విభజించారు. వీటి సర్వేకు 2,538 మంది ఎన్యూమరేటర్లను నియమించగా, 244 మందిని పర్యవేక్షకులుగా ఏర్పాటు చేశారు.
- మెదక్ జిల్లాలో 2,13,950 ఇండ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గ్రామీణ ప్రాంతంలో ఎన్యూమరేషన్ బ్లాక్‌లు 1,332 కాగా, మున్సిపాలిటీల్లో 239 చేశారు. గ్రామీణ ప్రాంతంలో సర్వే చేయడానికి 1,468 మంది, మున్సిపాలిటీల్లో 256 మంది ఎన్యూమరేటర్లను నియమించారు.పర్యవేక్షణకు గ్రామీణ ప్రాంతాల్లో 160 మంది, మున్సిపాలిటీల్లో 26 మంది అధికారులను ఏర్పాటు చేశారు.
- సంగారెడ్డి జిల్లాలో 4,08,190 కుటుంబాలను గుర్తించారు. వీటిలో 2,42,765 గ్రామీణ ప్రాంతంలో 1,65,425 మున్సిపాలిటీల్లో కుటుంబాలు ఉన్నాయి. వీటి సర్వేకు ప్రతి 150 నుంచి 180 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున నియామకం చేశారు. ఈ లెక్కన 3,800 మంది ఎన్యూమరేటర్లు ఉన్నారు. 338 మంది పర్యవేక్షకులు సర్వేలో పాల్గొంటున్నారు.

**సంక్షేమ పథకాల్లో కోత పెట్టేందుకే సర్వే**

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం సర్వే చేస్తున్నామని చెబుతున్నది. కానీ, దాని వెనక వేరే ఆలోచన ఉన్నట్లు తెలుస్తున్నది. గత ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి అలవి కాని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు హామీలను అమలు చేయడానికి కిందామీద పడుతున్నది. అందుకే సర్వేలో 75 ప్రశ్నలను పొందుపరిచి ఆదాయ వ్యయాల లెక్కలను అడుగుతున్నది. ఎంత భూమి ఉంది.. ఎన్ని ప్లాట్లు ఉన్నాయి. ఇలా సమగ్ర సర్వేను చేపడుతున్నది. దీంట్లో వచ్చిన ఆధారంగా సంక్షేమ పథకాల్లో కోత పెట్టడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఒకేరోజు చేసిన సమగ్ర కుటుంబ సర్వే డేటా ప్రభుత్వం వద్ద ఉంది. ఆ సర్వే కాదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల్లో కోతలు పెట్టడానికి ఈ సర్వే చేస్తూ కాలయాపన చేయడంతో పాటు భారీగా లబ్ధిదారులను తగ్గించేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపణలు ఉన్నాయి. సర్వే ప్రశ్నలను చూసి ప్రజలందరూ అదే జరుగుతదని ఆందోళన చెందుతున్నారు. వృద్ధులకు, వింతతువులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు పింఛన్ రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఏడాది పూర్తయినా ఇంత వరకు ఆ హామీ నెరవేర్చలేదు. రైతుబంధు ఇవ్వడం లేదు. పంట రుణమాఫీ అసంపూర్తిగా చేసింది. ఇతర పథకాలు అమలు కావడం లేదు. ఇప్పుడు సర్వేచేసి పథకాల్లో కోతల పెడుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### ప్రజల ప్రశ్నలకు ఎన్యూమరేటర్ల ఉక్కిరిబిక్కిరి

మద్దూరు, నవంబర్ 13: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు గ్రామాల్లో ప్రజల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సర్వేలో కుటుంబ వివరాలు చెప్పేందుకు ప్రజలు ససేమేరా అంటుండడంతో ఎన్యూమరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో కుటుంబాన్ని సర్వే చేసేందుకు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతుండడంతో ఎన్యూమరేటర్లు ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు రెండు నుంచి మూడు కుటుంబాలను మాత్రమే సర్వే చేయగలుగుతున్నారు. ఉపాధ్యాయులకు సర్వే బాధ్యతలు అప్పజెప్పడంతో ఉదయం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం సర్వే కోసం ఇండ్లకు వెళ్తుతుండడంతో ఇండ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో ఇండ్ల వద్ద ప్రజలు ఉండడం లేదు. దీంతో సర్వే కోసం వెళ్లిన ఉపాధ్యాయులు నిరాశగా వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు అడిగిన వివిధ రకాల ప్రశ్నలకు జవాబు చెప్పేందుకు జనం సుముఖత చూపడం లేదు. ప్రధానంగా వ్యక్తిగత, ఆర్థిక వివరాలు చెప్పేందుకు జనాలు నిరాకరిస్తున్నారు. సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లకు ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. సర్వేలతో ప్రజలకు అదనంగా ఒరిగే లాభం ఏమిటని నిలదిస్తున్నారు. దీంతో ఎన్యూమరేటర్ల పరిస్థితి 'ముందుకు పోతే గొయ్యి, వెనకకు పోతే నుయ్యి' అన్న చందంగా మారింది. అసలే పని ఒత్తిడితో సతమతమవుతున్న ఎన్యూమరేటర్లను ప్రజల ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



మద్దూరు మండలం రేబర్తిలో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్

### ఇంటింటి సర్వేలో ప్రజల ఎదురు ప్రశ్నలు

నిజాంపేట, నవంబర్ 13: ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఎన్యూమరేటర్లకు ప్రజల నుంచి ఎదురు ప్రశ్నలు ఎదురవుతున్నాయి. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని తిప్పనగుల్లలో చేపడుతున్న కుటుంబ సర్వేలో భాగంగా ఇంటికీ వెళ్లిన ఎన్యూమరేటర్ లలితకు గ్రామస్తురాలు నాగలక్ష్మి రైతుబంధు ఎప్పుడు ఇస్తరంటూ అడింది. 90శాతం మంది ప్రజలు రైతుబంధు ఏమైందని, ఎప్పుడు పైసలు వస్తాయంటూ ప్రశ్నిస్తున్నారని ఎన్యూమరేటర్ తెలిపారు.



ఖాసీపూర్‌లో సర్వే చేపడుతున్న ఎన్యూమరేటర్

**ఆస్తుల వివరాలు తెలపడం లేదు**

కుటుంబ సర్వేలో భాగంగా ఖాసీంపూర్ తండాలో ఇంటింటికీ వెళ్లి వివరాలు అడుగుతున్న క్రమంలో ప్రజలు అప్పులు మాత్రమే తెలుపుతూ.. ఆస్తుల వివరాలు తెలుపడానికి సతమతమవుతున్నారు. ఎక్కువ మంది రైతుబంధు పైసలు ఎప్పుడోస్తాయని అడుగుతున్నారు. ముందు రైతుబంధు ఇచ్చి సర్వేకు రావాలంటున్నారు.

### ఫ్రీ బస్సు మాత్రమే ప్రారంభించారు...



మహిళలకు ఫ్రీ బస్సు మాత్రమే ఇచ్చిండ్రు.. అవసరం ఉన్నవాళ్లే బస్సు ఎక్కుతరు.. బస్సు ఎక్కాలంటేనే భయం అవుతున్నది. మీకు ఫ్రీబస్సే కదా.. అక్కడికి పోండ్రి... వెనుక కూసోపొండ్రని కండక్టర్లు అంటండ్రు... ఫ్రీ బస్సు అవసరం లేదని.. మేము ఎంత ఇబ్బందిపడుతున్నమని మాకు తెలుసు. మీరు గీడికీడికే బస్సు ఎక్కుతర.. ఎందుకు వచ్చుడు.. గిట్ల మమ్మల్ని మాటలు అంటండ్రు... ఉన్నవాళ్లకంటే లేని వాళ్లకు పథకాలు ఇవ్వాలి కదా.. ఎన్నికలప్పుడు అన్ని చేస్తామని చెప్పిండ్రు... ఇంటింటికి తిరిగి రాసుకున్నరు. కానీ ఇయ్యలేదు.. మా ఆయన నేను పనిచేసుకుని బతుకుతన్నం. రెండువేల ఐదువందలు మహిళలకు ఇస్తామని చెప్పిండ్రు ఇప్పటివరకు ఇయ్యలే.. ఈ విషయం సర్వేలో పెట్టలేదు.. ఇందిరమ్మ ఇండ్లు కూడా రాలేదు మాకు.. గ్యాస్ డబ్బులు కూడా రాలేదు... గవర్నమెంట్ ఇప్పటి వరకు మాకు ఏం ఇయ్యలే... సర్వే చేస్తున్నరు కానీ, సర్కారే సాయం చేయ్యలే...

– అంబటి రమాదేవి, హుస్నాబాద్ టౌన్

### రూ. 2500 ఇస్తమన్నరు.. ఇయ్యలే..



ఎలచ్చన్‌లా రూ.2500 ఇస్తమన్నరు. కాంగ్రెస్ ఎక్కినకాంచి అన్నీ ఇస్తమన్నరు.. ఏమీ రాలే. రైతుబంధు సాయం కూడా ఇప్పటి వరకు రాలేదు.... అప్పుడు కేసీఆర్ ఉన్నప్పుడు ఇచ్చిండ్రు... ఏడాదికి రెండు మార్ల రైతుబంధు వచ్చేది... ఇప్పుడు ఎత్తనే లేరు.. రుణ మాఫీ అంటండ్రు.. ఇప్పటి వరకు సగం మందికి కూడా చేయలేదు. మాకు లేకపోయినా కనీసం రైతుబంధు ఎందుకు ఇయ్యలే... ఎకరం భూమి మాత్రమే మాకు ఉన్నది. అప్పులు తెచ్చుకుని ఎవుసం చేసుకుంటున్నం. కేసీఆర్ రాసిన పింఛన్ వత్తంది.. పింఛన్ పైసలతో గోలీలు తెచ్చుకొని బతుకుతున్నం.. గిప్పటివరకు కూడా మాకు న్యాయం జరగలె.. ఓట్లప్పుడు కనిపిస్తరు.. ఓట్లు వేసినంక ఎవ్వలు ఏం చేయట్లేదు...

– అంబటి రాజయ్య, రైతు, హుస్నాబాద్ టౌన్

## సీసీఐకి పత్తి విక్రయించాలంటే జంకుతున్న రైతులు



మేళసంగం శివారులో పత్తి లేక వెలవెలబోతున్న కల్క పత్తి మిల్లు

మునిపల్లి, నవంబర్ 13: సీసీఐకి పత్తి అమ్మాలంటే రైతులు జంకుతున్నారు. మునిపల్లి మండలంలోని సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేసేందుకు పత్తి మిల్లుల యాజమాన్యాలు ఆసక్తి చూపకపోవడంతో పత్తి మిల్లులు వెలవెలబోతున్నాయి. సీసీఐలో పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు రకరకాల నిబంధనలు పెట్టడంతో రైతులు పది పైసలు తక్కువ వచ్చినా ప్రైవేటుగా అమ్ముకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. రైతులకు సీసీఐలో పత్తి అమ్ముకోవాలని ఉన్నా సీసీఐ అధికారుల నిబంధనలకు అవస్థలు పడుతున్నారు. సీసీఐకి పత్తి తీసుకువస్తే నిబంధనలకు అనుకులంగా లేదని, పత్తి లోడ్‌ను వెనక్కి పంపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోడ్ వెనకకు రావడం వల్ల ఖర్చులు పెరిగి నష్టపోతున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పత్తి మిల్లుల్లో సక్రమంగా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## భారీగా గంజాయి పట్టివేత

తూప్రాన్, నవంబర్ 13: నిషేధిత గంజాయిని నిల్వ ఉంచి, విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన బుధవారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లి చౌరస్తా వద్ద ఓ వ్యక్తి నిషేధిత ఎండు గంజాయిని విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు మనోహరాబాద్ ఎస్ఐ సుభాశ్‌గౌడ్ సిబ్బందితో తనిఖీ చేశారు. నిందితుడు రంజన్‌కుమార్ తన చేతిలో ఉన్న గంజాయిని పొదల్లో పారవేసి పారపోయేందుకు ప్రయత్నించగా అతడిని పట్టుకుని విచారించారు. దీంతో నిందితుడు రంజన్‌కుమార్ ముప్పిరెడ్డిపల్లిలో ఉంటున్న స్నేహితుడు శ్రీధర్‌సాహు వద్దకు తీసుకెళ్లాడు. అతడిని విచారించగా రూమ్‌లో దాచిన 9 కిలోల 300 గ్రాముల ఎండు గంజాయిని చూపించాడు. మొత్తం గంజాయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి కేసును ఛేదించిన సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాశ్‌గౌడ్, కానిస్టేబుళ్లు ప్రసాద్, అనిల్, శ్రీనివాస్ గౌడ్, భిక్షపతిలను ఎస్పీ అందించారు.



తూప్రాన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

**పటాన్‌చెరులో ఆరు కిలోలు..**

పటాన్‌చెరు, నవంబర్ 13: పటాన్‌చెరు పట్టణంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంగారెడ్డి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 6.03 కేజీల గంజాయి పట్టుకున్నారు. బుధవారం పటాన్‌చెరు ఎక్సైజ్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు పట్టణంలోని వాల్యూజోన్ షోరూం ఎదుట, ఘనపూర్ చౌరస్తాలో ఎక్సైజ్ శాఖ అధికారులు వేర్వేరుగా వాహన తనిఖీలు చేపట్టారు. రెండు చోట్ల ఆరు కేజీల ముప్పై గ్రాముల గంజాయిని ముగ్గురు వ్యక్తుల వద్ద పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన మద్కమి లచ్చ (27), ఎర్మి సునామ్ (33), పునిమ్ (33)ల వద్ద గంజాయి లభ్యమైంది. మరో కేసులో బీహార్ వాసి తౌకిర్ హబీబ్(28) వద్ద గంజాయి లభ్యమైంది. వీరందరినీ సంగారెడ్డి కోర్టుకు తరలించారు.



బూర్గుపల్లిలో ఏర్పాటు చేసిన బోను

## చిరుత జాడ కోసం ముమ్మర గాలింపు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 13 : సిద్దిపేట జిల్లా బూర్గుపల్లి గ్రామ శివారులో చిరుతతో పాటు చిరుత పిల్లల సంచారం కలకలం రేపుతున్నది. రైతుల సమాచారంతో సిద్దిపేట ఫారెస్ట్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బూర్గుపల్లి గ్రామ శివారులోని చిరుత సంచరించిందనే అనుమానం ఉన్న ప్రదేశంలో ట్రాకింగ్ కెమెరాలు, పులిబోనును ఏర్పాటు చేశారు. గ్రామ శివారులో కొన్ని పాదముద్రలు గుర్తించామని, అవి చిరుత పాద ముద్రలే అని కచ్చితంగా చెప్పలేకపోతున్నామని సిద్దిపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విక్రముద్దీన్ తెలిపారు. గ్రామస్తులు రాత్రివేళ ఒంటరిగా తిరగవద్దన్నారు. జాగ్రత్తగా ఉండాలని, ఎవరికైనా చిరుత జాడ కనబడితే తమకు సమాచారం అందించాలన్నారు.